నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్-ములుగు
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

తప్పుడు ఆరోపణలు తగవు : ప్రిన్సిపాల్

నవతెలంగాణ-చెన్నారావుపేట



తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల వసతి గృహం(దుగ్గొండి)లో నాణ్యత లేకుండా విద్యార్థినీలకు భోజనాలు అందిస్తున్నామని కొందరు గిట్టనివారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రిన్సిపల్ రజిని అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే విద్యార్థినీలకు పౌష్టికాహారం ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ఇందులో పని చేసే ప్రతి ఒక్కరం విద్యార్థినీలను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నామని, దుగ్గొండి మండలం పేరు మీద ఉన్నా అక్కడ భవనాలు లేక ప్రభుత్వ సూచనల మేరకు చెన్నారావుపేటలోని ఓ ప్రయివేట్ భవనంలో అద్దెకు ఉంటున్నామని, మొదట్లో ఇబ్బందికరంగా ఉన్నా కొంత మరమ్మత్తులు చేశామని తెలిపారు. విద్యార్థిలకు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఈ వసతి గృహంపై అసత్య ప్రచారాలు చేయొద్దని కోరారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా పరిష్కరించుకుని ముందుకు వెళ్తామని తెలిపారు.

మళ్లీ మొదలైన ఇసుక దందా !

అక్రమ రవాణాను అడ్డుకునేవారే లేరా..

అక్రమార్కుల చేతిలో అధికారులు కీలు బొమ్మలా..?!

అలసత్వం వహించడంలో ఆంతర్యమేమిటో..?

ల్యాబర్తి గ్రామంలో ఇష్టారాజ్యంగా అక్రమార్కులు

నవతెలంగాణ-పర్వతగిరి



వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో మళ్లీ ఇసుక తవ్వకాల జోరు మొదలైంది. తవ్వినోళ్లకు తవ్వినంత అన్న చందంగా అక్రమార్కుల ఇష్టారాజ్యం కొనసాగుతుంది. స్థానిక అధికారులకు ముడుపులు ముడితే చాలు, ఆ చుట్టుపక్కలకు వెళ్లే పరిస్థితి ఉండదని గ్రామస్థులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. గ్రామంలో నలుగురు వ్యక్తులు ఒకరి తర్వాత మరొకరు తవ్వకాలు చేస్తూ ఒప్పందం ప్రకారం వ్యవసాయ భూములను తవ్వుతూ.. ఇసుక మాఫియాను కొనసాగిస్తున్నారన్నారని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. పత్రికల్లో పలుమార్లు వరుస కథనాలు వచ్చినా అధికారుల్లో, తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం విశేషం. నిరంతరం కొనసాగుతున్న ఇసుక మాఫియాను అడ్డుకోవాలంటే గత యుగంలో మాదిరిగా మరో దేవుడు పట్టాల్సిందేనని అన్న చందంగా వర్ధన్నపేట ఇసుక మాఫియా తయారైందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ల్యాబర్తి గ్రామంలో ఒక్క రోజుకు 100 ట్రాక్టర్లు లోడ్ చేసి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే అడ్డుకోవాల్సిన అధికారుల్లోనే కొంతమంది అక్రమార్కులకు వంతపాడుతున్నారని స్థానిక ప్రజలు బాహాటంగానే చెబుతున్నారు. తవ్వకాల వద్దకు అధికారులు వెళ్లితే ఎవరూ దొరక పోయినప్పటికీ సమగ్ర విచారణ చేపట్టినా సరే అక్రమార్కులను అరెస్టు చేసి కేసులు మోపి పోలీస్ స్టేషన్లో కస్టడీలో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అలా చేసినప్పుడు మాత్రమే ఈ దందాకు అడ్డుకట్ట పడుతుని ప్రజలు కోరుతున్నారు.

ఈసారి కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్సై ప్రవీణ్‌కుమార్(పర్వతగిరి)

ఇసుక దందాపై ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను నవ తెలంగాణ వివరణ కోరగా ఇదివరకు సంబంధిత వ్యక్తులపై, ట్రాక్టర్‌ల పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రెండు పంటలకు నీరందెలా లక్నవరం అభివృద్ధి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండల రైతాంగానికి రెండు పంటలకు సరిపడా నీరందేలా లక్నవరంను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం మండలంలోని లక్నవరం చెరువు తూములు లీకేజీ అభివృద్ధి పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గతంలో హామీ ఇచ్చిన విధంగా లక్నవరం ఆయకట్టు రైతాంగానికి రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించే విధంగా గోదావరి జలాలను లక్నవరం చెరువులోకి పంపింగ్ చేసేలా అభివద్ధి పరుస్తామని అన్నారు. తూముల లీకేజీకిగాను సుమారు 22లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ అభివద్ధి పనుల పట్ల అధికారులు సంబంధిత రైతులు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో కూడిన నిర్మాణాలను చేశారని అన్నారు. మరింత అభివద్ధి చేయాల్సిన అవసరం ఉందని త్వరలోనే హామీ ఇచ్చిన ప్రకారంగా పూర్తిస్థాయిలో అభివద్ధి పరుస్తామని చెప్పారు. మత్తడి లీకేజీ పనులు కూడా అరికట్టుతామని అన్నారు. ఇప్పటికే పర్యాటకపరంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని అందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. లక్నవరం పర్యాటక కేంద్రంగా నియోజకవర్గానికి మంచి గుర్తింపు లభించిందని, నిరంతరం నీరు ఉండేలా పర్యాటక కేంద్రం అభివద్ధికి కషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిఈ శ్రీనివాస్, ఏఈ ఉపేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండల కేంద్రంలోని పాత మొగ్గుంపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మహాజన నేత మంద కష్ణమాదిగ జన్మదినం సందర్భంగా ఆదివారం యువజ్యోతి యూత్ అధ్యక్షుడు. గద్దల ప్రశాంత్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ మేకల సదయ్య మాదిగ పాల్గొని జెండా ఆవిష్కరించి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల పక్షాన మాట్లాడి ప్రశ్నించే గొంతుక మందకష్ణ మాదిగ ఏండ్లుగా అలుపెరుగని పోరాట ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణతో పాటు అనేక సామాజిక అంశాల పైన విజయం సాధించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసి దేవరాజ్, రమేష్, పరికి నవీన్, చుంచు రాజశేఖర్, గద్దల ముక్తిషోర్, ఇతర ముత్తైశ్వర్, జన్ను చింటూ, మేకల సుధా, నిర్మల, పార్వత తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో ఆదివారం ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ధర్మయ్య అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్, మండల ఇంచార్జ్ బిర్రు మహేందర్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆవరణ వంశీ మాదిగ బొట్ల శ్రీకాంత్, చిన్నపెల్లి అనిల్, బొక్కల భరత్, సింగారపు నిఖిల్, చిన్న పెల్లి రోహిత్, జిల్లా సన్నీ, వేల్పుల చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పసర గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకులు ఇరుగు పైడి మాట్లాడుతూ మంద కష్ణ అద్భుతమైన నాయకత్వానికి నిలువెత్తు నిదర్శనం ముప్పై ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమం అని అన్నారు. నాయకుడి లేని ఉద్యమాలు కాలగర్భంలో కలిసిపోతాయి, నాయకుడు లేని జనసమూహాలు చెదిరి పోతాయి, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి, మాదిగ జాతికి మంద కష్ణ రూపంలో సమర్థవంతమైన నాయకత్వం లభించిందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మంద కష్ణ మాదిగల కోసం ప్రారంభించారు. సమాజ ప్రయోజనాల కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గొప్ప సామాజిక ఉద్యమంగా మంద కష్ణ తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎంఎస్ఎఫ్ కన్వీనర్ పేరాల బలరాం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మొగిలి, సీనియర్ నాయకులు పంగ శ్రీను తిక్క దుర్గారావు, నాగరాజు, సాంబయ్య, సదయ్య పాల్గొన్నారు.

తాడ్వాయి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ 30ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మండలంలోని కొత్తూరు (జంపంగవాయి) గ్రామంలో ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంఎస్పి ములుగు జిల్లా అధికార ప్రతినిధి గజ్జ ప్రసాద్ మాదిగ హాజరై, జెండా ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పురుషోత్తం నారాయణ, గజ్జల సమ్మయ్య, గజ్జల రాంబాబు, రాజేందర్, దుర్గయ్య, సందీప్, నవీన్, లోహిత్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

కేంద్రం విభజన హామీలను నెరవేర్చాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-భీమదేవరపల్లి

తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగులో ఉన్న అన్ని సమస్యలకు ముఖ్యమంత్రుల సమావేశం శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హనుమకొండ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఉట్కూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా పెండింగులో ఉన్న తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకుని సమావేశం కావడం హర్షనీయమని, ఇప్పటికైనా పూర్తి స్థాయిలో అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం పై ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువతకు ఉపాధికి భారీ పరిశ్రమలు లాంటి హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయబోమని ఎన్నికల ముందు చెప్పి నేడు టెండర్ లు పిలుస్తున్నారని అన్నారు. తెలంగాణాలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే టెండర్‌లు పిలుస్తున్నారని విమర్శించారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోసం ఆందోళనలు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలపై గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు,ఇండ్ల స్థలాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు తెలిపారు. జూలై 19న తహశీల్దారు కార్యాలయాల ఎదుట, జూన్ 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి స్థానిక సమస్యలపై దష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి కర్నాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు, సన్మానం

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో ఆదివారం పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, పాలకుర్తి మండలాల జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. ఇందులో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీకో ఆప్షన్ మెంబెర్లు, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమల, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ కుమార్, వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి..సంరక్షించాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రెవ ఇ. సహోదర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ఆవరణంలో వన మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలను బాధ్యతగా రక్షించి వక్షాలుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రెటరీ ఆకుల అశోక్‌గౌడ్, ఫాస్టేట్ సెక్రటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్ బండారి బిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజలిజం కన్వీనర్ గట్ల రవీందర్, యూత్ సెక్రటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేసి రంజిత్, ఎం సాంబయ్య, అనిల్, మర్రి రమేష్, శ్రీను, శోభన్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో 9 గొర్రెలు మృతి

నవతెలంగాణ-ఖానాపురం

విద్యుత్ షాక్ తగిలి గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని బుదరావుపేట గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బుదరావుపేట గ్రామానికి చెందిన ఘనపారపు సదయ్య తనకున్న గొర్రెలను మేపుకొని ఇంటికి తిరిగి తీసుకొని వచ్చాడు. అనంతరం భారీ వర్షం కురవడంతో గొర్రెలను రేకుల షెడ్డులో తరలించేక్రమంలో రేకుల షెడ్డుకు చుట్టిన ఫెన్సింగ్ వైర్ గొర్రెలకు తలిగి అక్కడికక్కడే 7గొర్రెలు మరణించగా.. అస్వస్థతకు గురైన రెండు గొర్రెలు ఆదివారం ఉదయం మరణించినట్లు తెలిపారు. కళ్లముందే 9గొర్రెలు మరణించడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. మరణించిన 9 గొర్రెల విలువ సుమారు లక్ష యాభై వేల రూపాయలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. బాధితుని ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలో అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోకుండా అక్రమార్కులకు మద్దతు పలుకుతున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతూ ఎలాంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా వారిపై ఉదాసీనత చూపుతున్న అధికారులు కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారన్నారు. భూగర్భ జలాలు పడిపోయే విధంగా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా ప్రవర్తించడం సరికాదన్నారు. లేదంటే అక్రమార్కులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.



సీఐపై హత్యా నేరం కేసు నమోదు చేయాలి

- సమగ్ర విచారణ జరిపి ఉద్యోగం నుంచి తొలగించాలి
- పోలీసు శాఖలో కుల వివక్షత సిగ్గుచేటు
- డీబీ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

నవతెలంగాణ-హనుమకొండచౌరస్తా

అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ల పై హత్యా నేరం నేరంతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ లోని అంబేద్కర్ సర్కిల్లో డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాసులు ఆత్మహత్యకు నిరసనగా ధర్నా చేశారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు స్తంభించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. అనంతరం చుంచు రాజేందర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని పోలీసు శాఖలో కుల వివక్షత సిగ్గుచేటని విమర్శించారు. ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ మాట్లాడుతూ కేసును పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులైన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో దళిత, సామాజిక, కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు మంద నవీన్, వేల్పుగొండ నర్సింగరావు, మోరే ఐలయ్య సిలువేరు నరేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డికి కృతజ్ఞతలు

మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల పరిధిలోని తిమ్మారాయినపహాడ్ శివారు 70సర్వే జల్లి శివారు 144, 74 సర్వే నెంబర్ గల జల్లిఎల్లాయిగూడెం, మాధవనగర్ తిమ్మారాయినపహాడ్ గ్రామాల్లో నివసించే రైతులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంట భూములు ఇచ్చింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పథకం పెట్టి ఇది వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన పట్టాదారులని ఫారెస్ట్ భూములుగా బంధించి ఇక్కడ ఉన్న రైతులకు అన్యాయం చేసింది. దీంతో రైతులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఇందిరమ్మ పేదలకు ఇచ్చిన ఈ సర్వే నెంబర్ గల వ్యవసాయ భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పట్టా బుక్కులు వచ్చేలా చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఉపాధక్షులు రూపిక శ్రావణ్‌కుమార్, జల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు బాధవత్ బాలు, రవి, చిల్పూరి వీరాస్వామి మంచాల సారయ్య, గంధం బాలరాజు, రూపిక వెంకన్న సుమన్, రవి, బిట్ల శ్రీను, వంగపండ్ల కట్టయ్య నర్సయ్య పాల్గొన్నారు.

కరెంటు కోతలు.. వినియోగదారుల వెతలు!

-సరఫరాలో లోపమా? అధికారుల నిర్లక్ష్యమా?

-కరెంటు కోతలతో

రైతుల పంటలకు పొంచి ఉన్న ముప్పు

నవతెలంగాణ-గార్ల



మండలంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది.తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ఎప్పుడూ వస్తుందో, ఎంతసేపు ఉంటుందో,ఎప్పుడూ పోతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.వానా కాలం రాకతో విద్యుత్ వినియోగం తగ్గినా కోతలు ఎందుకుంటున్నాయనేది వినియోగదారులకు కలుగుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. 24 గంటలు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటుందనే భావన ప్రజలలో వ్యక్తం అవుతుంది.ప్రతి రోజులో ఒక్కొక్క ప్రాంతంలో సుమారుగా పది సార్లు కరెంట్ కోతలు తీవ్రంగా ఉంటున్నాయని ప్రజలు, రైతులు వాపోతున్నారు. మండలంలో పోచారం, గార్ల, బయ్యారం మండలం కొత్తపేట సబ్ స్టేషనుల ద్వారా మండలంలోని ఇరవై గ్రామ పంచాయతీల లోని 36998 ప్రజలకు విద్యుత్ సరఫరా అవుతుండగా గృహ విద్యుత్ కనెక్షన్ లు,వ్యాపారా సాముదాయాలు,బావుల ద్వారా మొత్తం 15 వేల సర్వీసు లు ఉన్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి.ఒక్కొక్క సారి గంటల తరబడి రాకపోవడంతో ఫ్యూజ్ ఆఫ్ కాల్స్(వినియోగదారులు ఫోన్ ద్వారా తెలిపే) సమస్యలు తీర్చుతున్నామని విద్యుత్ సిబ్బంది చెప్పు తున్నారు.రోజు సమస్య తీర్చు తుంటే కరెంటు ఎందుకు ఎందుకు పోతుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.పదే పదే గంటల తరబడి కరెంటు కోతలతో వినియోగదారులు,చిరు వ్యాపారస్తులు నానా అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వెలిబుచ్చారు. పదే పదే కరెంటు వస్తూ పోతూ ఉండటం వలన ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలీ పోతున్నాయని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. కరెంటు కోతలు, పదే పదే కరెంటు కటింగ్ ల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని వివిధ సోషల్ మీడియా లో అధికారులు,సిబ్బంది తో తీవ్ర చర్చలు సైతం జరగడం జరిగింది.

అధికారుల నిర్లక్ష్యమా? సరఫరా లోపమా?

కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని,విద్యుత్ సరఫరాలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఉన్నతాధికారులు, మంత్రులు పదే పదే పలు ప్రభుత్వ కార్యక్రమ సమావేశాలలో చెప్పుతున్నారు. కానీ మండలంలో విద్యుత్ సరఫరా చూస్తే అందుకు భిన్నంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారనే విమర్శకులు వినియోగదారులు, ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి. గతంలో జరిగిన సర్వసభ్య సమావేశాలలో విద్యుత్ అధికారులు పని తీరు పట్ల ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీసినప్పటికీ విద్యుత్ అధికారులు పని తీరులో ఆశించిన మార్పులు రాలేదనే వాదన ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. జూలై నెల ప్రారంభమైనప్పటికీ వర్షాలు సంవద్ధిగా కురవక పోవటం పట్ల విత్తనాలు వేసిన రైతులు ఆందోళన చెందుతుంటే, మరోపక్క విద్యుత్ సరఫరాలో ఇలాంటి కోతలతో రైతులు పండించే పంటలపై నీలి నీడలు కమ్ము కున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలే వర్షాలు,రాత్రుల సమయంలో దోమల స్వైరవిహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారులకు,రైతుల పంటలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపాదికన కరెంటు లో కోతలు, సాంకేతికత సమస్యలు లేకుండా మరమ్మత్తులు చేపట్టాలని మండల ప్రజలు, వినియోగదారులు, రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ మహేందర్‌బాబును వివరణ కోరగా... విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న సమయంలో ఎల్‌సీ తీసుకోవడం జరుగుతుందని సిబ్బందితో సహా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి మరమ్మత్తులు ఏమైనా సమస్యలు ఉంటే మరమ్మత్తులు చేపడతామని చెప్పారు. తీగలు వదులుగా ఉన్న ప్రాంతాలలో అవసరమైన చోట స్తంభాలు, విద్యుత్ తీగలను అమర్చుతామని చెప్పారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి : కందునూరి శ్రీనివాస్(సీపీఐ(ఎం) మండల కార్యదర్శి)



రానున్న తీవ్ర వర్షా కాలన్ని దష్టి లో ఉంచుకుని సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి.రానున్న తీవ్ర వర్షా కాలాన్ని దష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు కోతల సమస్యలు లేకుండా మర మ్మత్తులు చేపట్టి ప్రజలకు, రైతుల కు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి.

విద్యుత్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం వీడాలి : మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్ లాల్



ప్రభుత్వం 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించిందని అ మేర కు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి. రైతులు ఇప్పటికే పంటలు వేశారని పంటలు ఎండి పోకుండా ముందస్తు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు, రైతుల కు ఇబ్బందులు లేకుండా చూడాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
సోమవారం జులై 08, 2024
www.navatelangana.com

టీడీపీ ఆత్మీయ సమ్మేళనానికి తరలిన వరంగల్ పార్టీ శ్రేణులు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాల్గవ సారిప్రమాణా స్వీకారం చేసి మొట్టమొదటి సారిగా తెలంగాణకు వచ్చిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఎన్‌టీఆర్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. వరంగల్ పార్లమెంట్ అధ్యక్షులు అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ రహీం, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ రజినీకాంత్, భూపాలపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మొక్కిరాల జనార్ధన్‌రావుతోపాటు పలువురు భారీగా తరలివెళ్లారు.

ఈసీ నుంచి సుదర్శన్, రమను తొలగించాలి

- కాంట్రాక్ట్ లెక్చరర్ అంజన్‌రావు, పార్ట్ టైం లెక్చరర్ నాయిని వినత

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



సుదర్శన్, రమను అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించడమే అక్రమమని, వారిని ప్రభుత్వం ఈసీ మెంబర్లుగా నియమించడం దారుణమని, వెంటనే వారిని తొలగించాలని కాంట్రాక్ట్ లెక్చరర్ అంజన్‌రావు, పార్ట్ టైం లెక్చరర్ నాయిని వినత కోరారు. ఇదే విషయమై ఆదివారం హనుమకొండలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 2010లో అన్ని డిపార్ట్మెంట్లలో కలిసి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా మొత్తం 37మందిని అక్రమంగా నియమించారని, యూనివర్సిటీలో కూడా గొడవలు జరిగాయని గుర్తు చేశారు. వారిలో కొందరు కోర్టుకు వెళ్లగా జువాలజీ లోని ఇద్దరి నియామకం అక్రమమని, తొలగించాలని సుప్రింకోర్టు ఆదేశాలతో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిందని అన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ సదరు ఇద్దరు టీచర్లు డివిజనల్ బెంచ్‌కి వెళ్లగా వారి నియామకం అక్రమమని తేల్చి చెప్పిందన్నారు. వారితో పాటు మిగతా 35 మంది పై కూడా కొత్త ఈసీ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించిందన్నారు. దీంతో జువాలజీలో సెలెక్ట్ అయిన ఇద్దరు సుప్రీంకోర్టుకు వెళ్లగా 2015లో కొత్త ఈసీ సమావేశంలో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని సూచించినట్టు గుర్తు చేశారు. కాగా 2019లో ఈసీ సమావేశంలోనూ వారి నియామకాలు అక్రమమని తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించారని అన్నారు. 2019లో కాకతీయ యూనివర్సిటీ ఈసీ తీర్మానం పంపిస్తే ఐదేండ్లుగా ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో 2010లో నియమించబడిన వారు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా అక్రమంగా అలాగే కొనసాగుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం వారిని ఈసీ మెంబర్లుగా నియమించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచించి వారిని ఈసీ నుండి తొలగించి అర్హులకు అవకాశం కల్పించాలని కోరారు.

అమ్మ అశోక్ రక్తదానం @45

నవతెలంగాణ - శాయంపేట



మండలంలోని పెద్దకొడపాక గ్రామానికి చెందిన భారత జాగృతి రాష్ట్ర నాయకులు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్ 45సార్లు రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పరకాల మండ లం పోచా రం గ్రామానికి చెందిన ఎనుముల సులోచన అనారోగ్యంతో బాధప డుతూ పరకాల ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకున్నాడు. రక్తం తక్కువగా ఉందని వైద్యులు తెలపడంతో ఆమె కుమారుడు అశోక్ కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. స్పందించిన అశోక్ ఆదివారం పర కాల ప్రభుత్వాస్పత్రికి వెళ్లి 45వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చా టుకున్నాడు. ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేస్తూ అందరికీ ఆద ర్శంగా నిలుస్తున్న అశోక్‌ను పలువురు అభినందించారు.

సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత రాంనర్సింహచారి

నవతెలంగాణ - హసన్‌పర్తి



సంస్కారవంతమైన సమాజ నిర్మాణంలో నా పిల్లలు భాగస్వాములు కావాలని జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత, హసన్‌పర్తి ప్రభుత్వ పాటశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాంనర్సింహాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ బాలిక పాఠశాల ఆవరణలో 1990-91 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతి అధ్యక్షతన జరిగింది. పూర్వ ఉపాధ్యాయులు శ్రీరామరెడ్డి, రహీమ్, గోపమ్మ, నరేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రావు, శ్రీదర్ రావు, సమ్మిరెడ్డి హాజరై మాట్లాడారు. నాటి ప్రధానో పాధ్యాయులు రాంనర్సింహాచారి సేవలు గుర్తు చేశారు. అనంతరం గురువులను సత్కరించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కందుకూరి సంజీవ్‌తోపాటు హసన్‌పర్తి, భీమారం, చింత7గట్టు, సీతంపేట, గంటూర్ పల్లీ, పలువెల్పుల, తిమ్మాపూర్, జయగిరి, కేశవాపూర్, మునిపల్లె, నాగారం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో సంత నిర్వహించొద్దు

నవతెలంగాణ-చిట్యాల



క్రీడా మైదానంలో సంత నిర్వహించొద్దని మం డల కేంద్ర క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిట్యాల మండల కేంద్రంలో గత ఐదు ఏండ్లుగా మెయిన్ రోడ్డుపై ప్రతి సోమవారం సంతను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై సంబంధిత గ్రామపంచాయతీలో కొందరు ఫిర్యాదు చేయగా గ్రామపంచాయతీ అధికారులు సంతను మె యిన్ రోడ్‌పై నుండి తొలగించి క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్నారు. క్రీడా మైదానంలో అంగడి నిర్వహిస్తే చెత్తాచెదారంతో దుర్గంధ భరితంగా మారుతోందని మండల కేంద్రానికి చెందిన కొంత మంది క్రీడాకారులు వాపోతున్నారు. చిట్యాల మం డల కేంద్రంలో క్రీడా మైదానం లేదని, పీఏసీఎస్ గ్రౌండ్, రామాలయ గ్రౌండ్‌ను క్రీడాకారులు ఉప యోగించుకొని ఉదయాన్నే వాకింగ్, క్రికెట్ వాలీబాల్ లాంటి క్రీడలు ఆడుతున్నారు. ఎలాగైనా సంబంధిత అధికారులు పునరాలోచించి క్రీడామైదానంలో ఎట్టి పరిస్థితుల్లో సంతను నిర్వహించొద్దని క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని పేర్కొంటున్నారు.

ముమ్మాటికీ కుల దురంకార హత్యే...

- ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ది ముమ్మాటికీ కుల దూరంకార హత్యగానే భావిస్తున్నామని ఉత్తర తెలంగాణ మాల మహనాడు అధ్యక్షుడు పీక కిరణ్ ఆరోపించారు. ఆదివారం కాటారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై ఆత్మహత్య బాధాకరం అన్నారు. ఆయన ఆత్మహత్యకు కారణమైన సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బందిని కఠినంగా శిక్షించి విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'బోగే మల్లయ్య'కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, బొగ్గుగని కార్మికుడు బోగే మల్లయ్య పదవీ విరమణ పొందారు. ఆయనను ఆదివారం తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నిత్యం సింగరేణి పరిరక్షణ, కంపెనీకి అనేక సేవలందించి అందరి మన్నలు పొందాడన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టియూసి కార్మిక సంఘంలో మల్లన్న ఆర్గనైజర్ సెక్రెటరీగా పనిచేసి కార్మికుల హక్కుల కోసం కృషి చేశారని కొనియాడారు.

ఎస్ఎఫ్ఐతో రాకేష్‌కు సంబంధం లేదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్

నవతెలంగాణ-రేగొండ

ఎస్ఎఫ్ఐ పేరు చెబుతూ స్కూల్ హెడ్మాస్టర్‌ల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న రేగొండ మండల కేంద్రానికి చెందిన గుటోజు రాకేష్‌చారికి ఎస్ఎఫ్ఐకి ఎలాంటి సంబంధాలు లేవని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేగొండ మండలంలోని మడతపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్కూల్ల్ హెడ్మాస్టర్‌ను బెదిరించి రాకేష్ డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు కాగా మండలంలోని ప్రైవేటు విద్యా సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ పేరుతో రాకేష్ డబ్బులు అడిగితే ఇవ్వొద్దని, తమకు తెలపాలని కోరారు. కాగా గత రెండు సంవత్సరాల నుండి రాకేష్‌కు ఎస్ఎఫ్ఐకి ఎలాంటి సంబంధాలు లేవని, ఎస్ఎఫ్ఐ నుండి అతని తొలగించినట్లు రాజ్ కుమార్ తెలిపారు.



'రాంచందర్'ను కలిసిన అనిల్ కుమార్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

హైదరాబాద్‌లో జాతీయ ఎస్సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను కాకతీయ యూనివర్సిటీ విద్యార్థినేత గాడెపాక అనిల్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాకతీయ యూనివర్సిటీలో రిజర్వే షన్, చట్టాలపై అవగాహన సదస్సుకు హాజరైనందుకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇరు వురు చర్చించారు. యూనివర్సిటీలో, తెలంగాణలో ఉన్న యూనివర్సి టీలలో, కలెక్టర్ కార్యాలయాల్లోని అన్ని విభాగాలలో ఖాళీగా ఉన్న ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టుల మంజూరు, తదితర సమస్యలను రాంచందర్ దృష్టికి తీసుకెళ్లానని, ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ప్రజలు పుకార్లు నమ్మొద్దు

- తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్

నవతెలంగాణ-మహాదేవపూర్

అత్యవసరమైన రేషన్ కార్డులో తప్పులు సరి చేయుటకు, కొత్త గా పిల్లల పేర్లు యాడ్ చేయుటకు, పెళ్లి అయిన యువతులు అత్తవారింటి రేషన్ కార్డులో పేరు యాడ్ చేయుటకు తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను నమ్మొద్దని దహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. పుకార్లను నమ్మవద్దని ప్రభుత్వం నుండి ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డులో సవరణలు చేసేందుకు కుటుంబ యజమాని బ్యాంకు పాస్ పుస్తకం లేదా ఓటర్ కార్డు, కుటుంబ సభ్యుల అందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రాల్లో సంప్రదించాలని వస్తున్న పుకార్లు ఫేక్ అని అన్నారు.



వరంగల్, హనుమకొండ ట్రెంగ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సుబేదారి

వరంగల్, హనుమకొండ ట్రెంగ కార్యవర్గంను ఎన్నుకున్నట్టు ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి తెలిపారు. ఆదివారం హనుమకొండ వరంగల్ జిల్లాల్లో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్(ట్రెంగ) ఎన్నికలు హనుమకొండ లోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా మరుపట్ల మల్లయ్య, గౌరవ అధ్యక్షునిగా పొట్లపల్లి రవీందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా మేకల రమేష్, కోశాధికారిగా పొలుసారి దామోదర్, ప్రచార కార్యదర్శిగా గుడెపు వీరాస్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షులుగా భూక్య కస్నానాయక్, ప్రధాన కార్యదర్శిగా నాలిక ఆనంద్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా పెండ్లి రంజిత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీ నారాయణ, ఐలేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగితా కార్యవర్గం అలాగే కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మహ్మద్ సలీం పాషా, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఖదీర్‌ఖాన్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు హంస నరేందర్, మరో ఉపాధ్యక్షులు మహ్మద్ రజాక్, ప్రచార కార్యదర్శి పెండ్లి రంజిత్ రెడ్డి, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లించి ఆదర్శంగా నిలవాలి

- ఐసిఏఐ వరంగల్ బ్రాంచ్ మాజీ చైర్మన్ రాయబారపు హరికృష్ణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జులై 30వ తేదీ లోపు ఆదాయం పన్ను దాఖలు చేయాలని ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ మాజీ చైర్మెన్ రాయబారపు హరికృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జులై 31వ తేదీ లోపు ఆదాయపు పన్ను చెల్లిస్తే అపరాధ రుసుము వర్తించదని అన్నారు. గడువు ముగిసిన తర్వాత దాఖలు చేస్తే నిర్ణయించిన కాల వ్యవధి వరకు అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు, ఉన్నత శ్రేణి వేతన ఉద్యోగస్తులు, ఇతర పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు.

ఎస్సై శ్రీనివాస్ మృతి కారకులపై చర్యలు తీసుకోవాలి : బీఎస్ఎస్

నవతెలంగాణ - శాయంపేట

దళిత సామాజిక వర్గంలో జన్మించి ఉన్నత చదువులు చదువుకొని ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ మరణానికి కారణమైన బాధ్యులను ఉద్యోగాల నుండి సస్పెండ్ చేసి శిక్ష పడేలా చూడాలని బహుజన సంక్షేమ సంఘం(బీఎస్ఎస్) జిల్లా అధ్యక్షులు మగ్గం సుమన్ ఆదివారం ప్రకటనలో కోరారు. శ్రీనివాస్ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో కింది స్థాయి ఉద్యోగులపై ఉన్నతస్థాయి అధికారుల వేధింపులు, కక్ష సాధింపు చర్యల వల్లే మానసిక ఒత్తిళ్ల తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

నేడు ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ - ఆత్మకూరు

ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపిటిసి, కో ఆప్షన్ మెంబర్ల ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగియడంతో వారికీ నేడు(సోమవారం) ఆత్మకూరు మండల అధికారులు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం

నవతెలంగాణ - శాయంపేట

శాయంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, మండల ప్రాదేశిక సభ్యులు, గ్రామాల సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో సోమవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫణి చంద్ర ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ, ఎంపీటీసీలకు, మండల పరిధిలో 24 గ్రామాల సర్పంచ్లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరవుతారని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



పోరాటాలు కొనసాగించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గంగారపు శ్రీనివాస్

నవతెలంగాణ-ధర్మసాగర్

ఎమ్మార్పీఎస్ అమరుల ఆశయ సాధనకు పోరాటాలు కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పుట్ట దేవరాజు మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్‌తో కలిసి శ్రీనివాస్ మాదిగ పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఇదే రోజు అణగారిన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు. కొట్టే శివ, మట్టెడ బాలస్వామి ,గుట్ట కళ్యాణ్, చిలుక రాజు, కొట్టే కళ్యాణ్, మాచర్ల బాబు మండల నాయకులు, కొట్టే అంటోని మండల నాయకులు, ఏనుట్ల గణేష్, గంగారపు చిన్ని, పవన్, భాస్కర్, శీను, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మార్పీఎస్ ఉద్యమానికే చరిత్ర ఉంది'



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

30 ఏండ్లుగా అనేక సామాజిక మానవతా ఉద్యమాలతో తెలుగు నేలను పునీతం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్ ఉద్యమానికే ఉందని ప్రొఫెసర్ పోడేటి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంను కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ఎమ్మెస్ఎఫ్ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. అలాగే మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్క రించారు. అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, ఎమ్మెస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డేపల్లి మధుకర్‌మాదిగ, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా మంద నరేష్ మాదిగ, యువసేన నాయకులు భిక్షపతి మాదిగ, స్వేరో స్టూడెంట్ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-పరకాల

ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం స్థానిక బస్టాండ్ కూడలిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, పరకాల మండల ఇన్చార్జ్ జిల్లెల్ల మురళి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగురవేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సోద అనిత-రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం ప్రకాశం జిల్లా ఈదురుమూడి అనే చిన్న గ్రామంలో 20 మందితో ఎమ్మార్పీఎస్ ఉద్యమం మొదలై అంచలంచలుగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఏకైక కుల సంఘం ఎమ్మార్పీఎస్ అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ సారధ్యంలో పోరాడి అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందించేలా చేసిందన్నారు. అనంతరం మందకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కౌన్సిలర్లు మడికొండ సంపత్ ,ఏకు రాజు, పసుల లావణ్య -రమేష్, బీజేపీ నాయకులు మేకల రాజా వీరు, మార్త బిక్షపతి, ఎంఆర్పీఎస్ నాయకులు చంద్రమౌళి, మేకుల దేవేందర్, గోవింద సురేష్ , ఏకు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కోడేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ ,ఇసంపెల్లి రాజు కుమార్ మాదిగ, ఇనుముల చంద్రమోగిలి మాదిగ,ఇసంపెల్లి అనదీప్ మాదిగ,ఇసంపెల్లి ప్రభాకర్ మాదిగ, పుల్ల శాంతికుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మంద రాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడారు. మాదిగలకు ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని, గుర్తింపును తీసుకొచ్చిన జెండా ఎమ్మార్పీఎస్ అని అన్నారు. అనంతరం మందకృష్ణ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆత్మకూర్ మాజీ మండల అధ్యక్షులు మంద రవి, ఆత్మకూరు మండల కన్వీనర్ నందమూరి రఘు, పోలేపాక వినోద్, శ్రీకాంత్ ప్రకాష్ ,సమ్మయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దండోరా జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా ఆదివారం జాతీయ నాయకులు, ఎల్కతుర్తి మండల ఇన్‌చార్జి పుట్టా రవి మాదిగ ఆధ్వర్యంలో మాదిగ దండోరా జెండా ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. అంబాల రవీందర్, అంబాల బాబు, గొల్లె మహేందర్, కొమ్మిడి నిరంజన్ రెడ్డి, బొంకూరి రవీందర్, జూపాక జడ్సన్, అంబాల స్వరూప, లోకి స్వరూప, శనిగరపు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

శాయంపేట మండల ప్రత్యేక అధికారిగా మధురిమ

నవతెలంగాణ - శాయంపేట

శాయంపేట మండల స్పెషల్ ఆఫీసర్గా జిల్లా సంక్షేమ అధికారి మధురిమను నియమించినట్లు జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో జరిగిన ఎంపీటీసీల ఎన్నికలలో ఎన్నికైన శాయంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, మండల ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం ఈనెల 3న ముగియడంతో, పరిపాలన సౌలభ్యం కోసం మండల స్పెషల్ ఆఫీసర్ల నియామకాలను జిల్లా కలెక్టర్లు చేపట్టారు. ఈ క్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్‌గా డీడబ్ల్యూఓ మధురిమను నియమించారు.



రైతులకు ఉచిత మిరప విత్తనాలు పంపిణీ

వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు

నవతెలంగాణ-రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో రైతు వ్యవసాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఉచిత మిరప విత్తనాలు పంపిణీ చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపకులు సిరికొండ తిరుపతిరావు తెలిపారు. ఆదివారం రేగొండ మండలం లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి రావు మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు దాదాపు 500మంది రైతులకు ఒక్క రైతుకు రూ.5000 విలువగల జనత మిరప విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా రైతులకు రూ.5000 విలువైన పురుగు మందులు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 16మంది డైరెక్టర్లతో ఏర్పాటుచేసిన ఈ రైతు వ్యవసాయ సంక్షేమ సంఘం భూపాలపల్లి నియోజకవర్గంలోని రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తోందని అన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు పొందిన రైతులకు మాత్రమే ఉచిత విత్తనాలు,ఉచిత పురుగుమందులు అందజేస్తారని అన్నారు. ఇప్పటివరకు రేగొండ ఉమ్మడి మండలాలు, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి గణపురం, భూపాలపల్లి మండలాల్లో 900 వరకుపైగా జనతా మిరప విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తిరుపతిరావు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ దుర్గయ్యకు సన్మానం



నవతెలంగాణ-మహదేవపూర్


మహదేవపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన పదవీ విరమణ పొందిన మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్యను అఖిలపక్ష నాయకులు ఆదివారం అన్నారంలో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ దుర్గయ్య 5సంవత్సరాల పదవీకాలంలో అందరికి సేవలందించారాని అన్నారు. ఆయనవంతు అభివృద్ధి చేసారని అన్నారు. పదవీ విరమణ పదవీకే కానీ సేవకు కాదన్నారు. ఇలానే సామాజిక సేవలో రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమునూరి రమ -శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు బండం రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా కార్యదర్శి పర్సవేణి నాగేష్ యాదవ్, కారోబార్ రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దునే సమ్మయ్య, ఆకుదారి మల్లేష్, అఖిలపక్షం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నవతెలంగాణ-రేగొండ

రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మడతపల్లి ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ 10తరగతి పూర్వవిద్యార్థులు 25వ సిల్వర్ జూబ్లీ వేడుకల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాపశెట్టి దేవేందర్ పేర్ల రజిత, కొత్త నర్సయ్య, లక్కం రాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు శ్రీహరి, సూర రాఘా వులు, వేణుమాధవచారి, సత్యనారాయణ, మహేందర్ రాజు, శ్రీనివాస్ ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థులు నాటి గురువులకు మెమొంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు డాక్టర్ పవన్, ఏరుకొండ రఘు, గొల్ల రజిత, మంజుల, మామిడాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



'విద్యార్థిని వైష్ణవి'కి ఎమ్మెల్యే సన్మానం

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హై స్కూల్ విద్యార్థిని దుగ్యాల వైష్ణవికి ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించగా ఆ విద్యార్థిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం సన్మానించారు. అంతేకాక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, శివశంకర్, యాదగిరి, జగన్‌రెడ్డిలను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులు దుగ్యాల లక్ష్మణరావు-వాణిలను శాలువాలతో సన్మానించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-చిట్యాల



మండల కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాముకుంట్ల తిరుపతయ్య ఇటీవల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో రామ్‌నగర్ కాలనీకి చెందిన స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి మాట్లాడారు. తమ కాలనీ నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికై అనేక ఉత్తమ అవార్డులు సాధించి ఇటీవల మండలంలోని నైన్‌పాక గ్రామ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి సాధించడం గర్వకారణమని అన్నారు. ఇలాంటి మరెన్నో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం పాముగుంట్ల తిరుపతయ్య మాట్లాడుతూ... గ్రామ నిరుపేదల విద్యాభివద్ధి కి సహాయం అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ యూత్ నాయకులు జెండా యుగంధర్, గ్రామ పెద్దలు కటుకూరి నరసయ్య, పుల్ల మల్లయ్య, గుమ్మడి సత్యనారాయణ మాజీ ఎంపీటీసీ, కట్కూరి పద్మ నరేందర్, నరసింహా రాములు, రవి రాజేందర్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన ప్రత్యేక పాలన

పారిశుద్ధ్యంపై పట్టింపు కరువు కుక్కలు,పందులు స్వైరవిహారం

మూడు నెలలుగా కార్మికులకు అందని వేతనాలు

కార్యదర్శులకు తప్పని కష్టాలు



నవతెలంగాణ-మల్హర్‌రావు

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండల పరిధిలోని 15 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక పాలన పూర్తిగా గాడి తప్పింది. పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులు సమ యపాలన పాటించకపోగా గ్రామాలవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక పాలనలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్లపై చెత్తాచెదారం, రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మురుగు నీరు రోడ్లపై, ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో నీటి నిల్వలు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీటి గుంతలో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలు ప్రబలు తున్నాయి. అంతర్గత రోడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. పారి శుధ్య పనులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపో వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొత్తంగా పల్లె పాలన పడకేసింది. కుక్కలు, పందులు, కోతుల స్వైర విహారంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. అసలే వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

జీపీ ఖాతాలు ఖాళీ...

గ్రామపంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం కరెంట్ బిల్లులు, బోర్ మరమ్మతులు, డీజిల్ కొనలేని పరిస్థితి ఏర్పడింది. మల్టీపర్పస్ వర్కర్లకు 3నెలలుగా జీతాలు కరువైయ్యాయి. కరెంట్ బిల్లులు భారంగా మారాయి. మురుగు కాల్వలు తీయడం, ప్లాస్టిక్ ఎరడం తలనొప్పిగా మారింది. దీంతో స్పెషల్ ఆఫీసర్లు చేతులెత్తేసినట్టు తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి కనీస అవసరాలు తీర్చేందుకు నానా తంటాలు పడుతున్న పరిస్థితి నెలకొంది. పెద్ద గ్రామపంచాయతీలకు కొంత ఊరట ఉన్నా, వెయ్యిలోపు జనాభా ఉన్న పంచాయతీల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.



పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం,స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు కాగా 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సి నిధులు రావడం లేదు. ఇక జనా భా అనుగుణంగా ఒక్కొక్కరి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తోంది. ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి అవికూడా రావడం లేదు. ఇక పెద్ద గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులు, తైబజార్, గృహ నిర్మాణ ఫీజులు, వ్యాపార, వాణిజ్య లైసెన్స్ ఫీజుల రూ పంలో కొంత ఆదాయం సమకూరుతోంది. కానీ, చిన్న గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ తప్పా ఎలాంటి ఇతర మార్గాలు లేవు. ఇక వీరు నెలనెలా ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్, బోర్లు రిపేర్, కరెంట్ బిల్లులు,విద్యుత్ బల్బులు, డంపు యార్డుల నిర్వహణ, మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు, పారిశుధ్యం, ప్లాస్టిక్ ఏరివేత తాగునీటి సమస్య లాంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. అయితే వీటికి వనరులు లేక నానా అవస్థలు పడుతున్నారు.స్పెషల్ ఆఫీసర్లు కనీసం పంచాయతీల వైపు తొంగి చూసిన దాఖ లాల్లేవని మండల ప్రజలు వాపోతున్నారు. దీంతో ఒక్కొక్క కార్యదర్శి ఐదు నెలల కాలంలో రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు అప్పులు చేసినట్లు సమాచారం.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు కనిపించడం లేదు.అంతర్గత రోడ్లు అపరిశుభ్రంగా, చెత్త,చెదారం,పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయి దుర్గంధం వేదజల్లుతొంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోని పారిశుధ్య పనులు చేపట్టాలి.లేదంటే ప్రజలు అనారోగ్యానికి గురైయ్యే ప్రమాదం పొంచివుంది.

-అక్కల బాపు యాదవ్., ప్రజా సంఘాల నాయకుడు

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు శాశ్వత పరిష్కారమేదీ ?

- చీటికీ మాటికి పైప్ లైన్ లీకేజీలు
- ఆరేవాగు బ్రిడ్జిపై వృధాగా పోతున్న నీరు
- జారిపడుతున్న ప్రయాణికులు
- కలెక్టర్ పట్టించుకోవాలని ప్రజలు విజ్ఞప్తి



నవతెలంగాణ-మల్హర్‌రావు

మల్హర్‌రావు మండలంలోని మల్లారం గ్రామ పరిధి ఆరేవాగు బ్రిడ్జిపై నుంచి వేసిన మిషన్ భగీరథ పైప్ లైన్ తాడిచెర్ల, మల్లారం, చిన్నతూండ్ల గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా కోసం గత ప్రభు త్వంలో వేశారు. అయితే పైప్ లైన్ చీటికీ మాటికి, వారానికి ఒకసారి లీకే జవుతూ తాగునీరు వృధాగా బ్రిడ్జిపై పోవడంతో ప్రయాణి కులు జారీ పడుతున్నారు. ఇసుక, బొగ్గు లారీలు అధిక లోడ్‌లతో వెళ్లడంతో బ్రిడ్జిపై భారీగా గుంతలు చిన్నపాటి కుంటలను తలపించేలా కావడం, లీకేజీ నీరు భగీరథ నీరు గుంతల్లో చేరడం వల్ల ద్విచక్ర, ఇతర వాహనాల ప్రయాణికులు జారీ పడుతున్నారు. బ్రిడ్జిపై వేసిన మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలకు శాశ్వత పరిష్కారం లేదని ఆయా గ్రా మాల ప్రజలు మిషన్ భగీరథ, ఇంట్ర అధికారులను ప్రశ్నిస్తున్నారు.



చిటికి మాటికి పైప్ లైన్ లీకేజీ అయిన నీటితో బ్రిడ్జి ప్రమాదకరంగా మారడమే కాకుండా భారీగా గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహదారులు వాపోతు న్నారు. అటు నీరు బ్రిడ్జిపై రావడం, ఇటు లారీలు నిత్యం నడవడంతో వంతెనపై భారీగా గుంతలు ఏర్పడి, పిల్లర్ల మధ్యలో రాడ్లు తేలి బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనపై సిమెంట్ పోయి ఏర్పడిన గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రాత్రి వేళల్లో వాహన దారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణి స్తున్న పరిస్థితి. నిత్యం ఈ వంతెనపై నుంచి తాడి చెర్ల, మల్లారం, చిన్నతూండ్ల గ్రామాల ప్రయాణికు లు కొయ్యూర్ మీదుగా కాటారం, మంథని వెళ్లుతుం టారు. భారీ ప్రమాదాలు జరగకముందే భూపాలపల్లి జిల్లా కలెక్టర్ పట్టించుకుని మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంట్ర అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మ తులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-గణపురం



మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జిల్లా నాయకులు గణపురం మండలం ఇన్‌చార్జి బొల్లి బాబుమాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు రేగొండ మండల ఇన్‌చార్జి గాజుల భిక్షపతి మాదిగ హాజరై ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకల సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎల్ల స్వామి, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, గణపురం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తిక్క సంపత్, పెద్దలు ఆలూరి మొగిలి, తిక్క రాధాకృష్ణ చిలువేరు దయాకర్, ఆరు ముళ్ళ ప్రభాకర్, కొంపెల్లి సాంబయ్య, యూత్ నాయకులు మేకల బబ్లు, సామర్ల సంపత్, ఇంజపెల్లి షోలేమాన్, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-మహదేవపూర్



మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. 1994లో జులై 7న 20 మందితో ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేశారని, అదే రోజు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు అన్నారు. నాటి నుండి నేటి వరకు అలుపెరుగని పోరాటాలు ఎమ్మార్పీఎస్ చేసిందని, వృద్ధులు, వికలాంగులు, వితంతువుల హక్కుల సాధనకు పోరాటాలు కొనసాగిస్తోందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘ నాయకులతో కలిసి మందకృష్ణ జన్మదిన వేడుకలు జరిపారు. మాజీ ఎంపీపీ రాణిభాయ్, మాజీ సర్పంచ్ శ్రీపతి బాబు, మాజీ ఎంపీటీసీ ఆకు తోట సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అక్బర్‌ఖాన్, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్, తుడుం దెబ్బ మండల నాయకులు కాల్నేని రాములు, బీసీ సంఘాల నాయకులు కారంగుల బాబురావు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చేకూర్తి శంకరయ్య, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

ఏబీసీడీ వర్గీకరణతోనే మేలు


ఏబీసీడీ వర్గీకరణ జరిగేతేనే 59 కులాలకు మేలు జరుగుతుందని ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి తూడిచర్ల దుర్గయ్య మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో ప్రధాన కూడలిలో ఆదివారం జెండావిష్కరణ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మడక ప్రతాప్‌రెడ్డి, సూరారం గ్రామశాఖ అధ్యక్షులు కోయ్యల మల్లయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు పూల్యాలా దుర్గయ్య జిల్లేల సమ్మయ్య, కోయ్యల శ్రీనివాస్, తూడిచెర్ల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారం గ్రామంలో...

మండలంలోని అన్నారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య ఆధ్వర్యంలో, మద్దులపల్లి గ్రామంలో కొరల బానయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పలుగుల, కాళేశ్వరం ఎడపల్లి, బ్రాహ్మణపల్లి, బెగులూరు, అంబటిపల్లి, తదితర గ్రామాల్లోనూ ఆవిర్భావ వేడుకలు జరిపారు. మాజీ ఎంపిటిసి మంచినీళ్ల దుర్గయ్య, వివిధ కుల సంఘ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు ముమ్మరం

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండల పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం కాళేశ్వరం గ్రామంలో కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, ఏఎస్ఐ రాజేశం, సిబ్బంది, తదితరులతో కలిసి తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. కాళేశ్వరం గ్రామంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో షాపింగ్‌లు, టెంపుల్ ఏరియాలో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. కాళేశ్వరం గ్రామం నుండి పలుగుల రోడ్డుపై నిలిచి ఉన్న లారీల డ్రైవర్లతో సమావేశమై మాట్లాడారు. వాహనాల పార్కింగ్ క్రమబద్ధంగా ఉండాలని, లారీ డ్రైవర్లు, ఇసుక క్వారీల నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. అలాగే అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. విధిగా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. అలాగే కాళేశ్వరంలో సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు నూతన చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును తనిఖీ

నవతెలంగాణ-మహదేవపూర్



మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీసీ బస్సును ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఇటీవల కాళేశ్వరంలో వరుసగా దొంగ తనాలు జరుగుతుండడంతోపాటు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు కావడంతో మత్తు పదార్థాలు గంజాయి, ఇతర అసాంఘిక శక్తులను అరికట్టడానికి తనిఖీలు చేపట్టారు. బస్సుల్లో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై చక్రపాణి ప్రయాణీకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తనిఖీల్లో భాగంగా సరియైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. స్థానిక సివిల్ సీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

కళావేదిక రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా జవ్వాజి ప్రవీణ్ కుమార్ నియామకం

నవతెలంగాణ-కొడకండ్ల



తెలంగాణ కళావేదిక రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన జవ్వాజి ప్రవీణ్ కుమార్ నియమిస్తూ తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా కళావేదికలను మరింత ముందు తీసుకు వెళ్లేందుకు కర్షుషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నగరకంటి కిరణ్ కుమార్ కు కళాకారులకు కృతజ్ఞతలు తెలియజేశారు

సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయం

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-లింగాలఘనపురం

సామాజిక ఆర్థిక రాజకీయ ప్రగతి సాధించి మాదిగ జాతిని విముక్తి చేయడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని, భారతదేశ సామాజిక ఉద్యమాల చరిత్రలో 30 ఏండ్లు ప్రజల హృదయాల్లో సజీవంగా జీవించి నూతన శకానికి నాంది పలికిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరణ చేశారు. ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సంధిన రవీందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన 30వ ఆవిర్భావ కార్యక్రమానికి రాగళ్ల ఉపేందర్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం జరిగిన తరువాతనే మాదిగల జాతికి గుర్తింపు, గౌరవం వచ్చిందని అన్నారు. కులం పేరు చెప్పడానికి భయపడిన పరిస్థితుల నుండి మాదిగలమని గర్వంగా ప్రకటించుకునే ఆత్మగౌరవాన్ని నింపిందన్నారు. మాదిగల కోసమే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పోరాడి ఆరోగ్య శ్రీ పథకం, వికలాంగులకు, వృద్ధులు వితంతువులకు పెన్షన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళల అత్యాచారాల నిరోధానికి 36 ఫాస్ట్రాక్ కోర్టులను ఎమ్మార్పీఎస్ సాధించిందన్నారు. మంద కృష్ణ మాదిగ 60వ జన్మదినం సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు గట్టుగాళ్ళ బాబు మాదిగ, యాదగిరి మాదిగ, కుంటి రామ్ చందర్, కరుణాకర్, అనిల్, నక్క వంశి, చంద్రశేఖర్, గువ్వల రవి, నర్సయ్య, యాదగిరి, విష్ణు, గ్రామ మాదిగలు, యువకులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

వరంగల్-ఖమ్మం 563 జాతీయ రహదారిపై ప్రయాణికుల ఇబ్బందులు



నవతెలంగాణ-దంతాలపల్లి

జాతీయ రహదారిపై ప్రయాణం అంటే ఎవరైనా హ్యాపీగా వెళ్లొచ్చని అనుకుంటారు. మండల పరిధిలోని వరంగల్- ఖమ్మం 563 రాష్ట్ర రహదారి అంటే మాత్రం అందరూ భయపడుతున్నారు. అక్కడక్కడ ఉన్న గుంతలపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు, ప్రమాదకరంగా మారిన చోట ఇంజనీరింగ్ అధికారులు కనీసం డాంబర్ తో ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బొడ్లాడా స్టేజి నుంచి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, పోలీస్ స్టేషన్ ముందు, తహసిల్దార్ కార్యాలయం సమీపంలో రాత్రి పగలు అనే తేడా లేకుండా రోడ్డుపై నిలుస్తున్న వాహనాలు, ఇలా నర్సింహులపేట మండలం సరిహద్దు వరకు సుమారు 9 కిలోమీటర్లు వరకు జాతీయ రహదారి, ఆయా రోడ్లపై జనవరి 2024 నుంచి ఇప్పటివరకు రోడ్డు ప్రమాదంలో ప్రమాదాలకుగురై 8 మంది మృతి చెందగా, ఆరు కేసులు నమోదయ్యాయి. పలుమార్లు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలు అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు

కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్త శ్రీనివాస్



పలుమార్లు వరంగల్-ఖమ్మం 563 రాష్ట్ర రహదారిపై ప్రమాదాల జరుగుతున్న ఆర్అండ్బి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని,, మార్త శ్రీనివాస్ అన్నారు. ఈ ప్రమాదలు జరుగుతున్నట్లు 'నవ తెలంగాణ' దినపత్రికలో పలు వార్తలు వచ్చిన విషయాన్ని రోడ్డు రవాణా శాఖ అధికారులు పట్టించుకున్నట్లయితే శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తుల మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు, జరిగేవి కావని, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఇప్పటికైనా అధికారులు అక్కడక్కడ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి.

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

మండలంలోని పలు గ్రామాలలో స్థానికులు సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యాసిశ్వినీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు ఆదివారం కొమ్మనపల్లి తండా గ్రామంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గ్రామ పెద్దలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో గ్రామంలో సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. గ్రామాలలో సమస్యలు ఉంటే స్థానిక అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాడియా రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మగ్యా నాయక్, బాలాజీ, రవీందర్, బిచ్యా, రమేష్, రామ, భీకు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు ఏజీపీగా వెంకన్న గౌడ్‌నియామకం

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్/తొర్రూర్



తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన బండపల్లి వెంకన్న 1995లో బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్ గా ఎన్‌రోల్‌మెంట్ పొంది. 1995 నుంచి హనుమకొండ కోర్టులో, 2000 సంవత్సరం నుంచి 2009 వరకు మహబూబాబాద్ కోర్టులో, తొర్రూర్ కోర్ట్ ఆవిర్భావం నుంచి తొర్రూర్ కోర్టులో సీనియర్ లాయర్ గా విధులు నిర్వహిస్తూ అనేక సివిల్, క్రిమినల్ కేసుల్లో వాధించారు.. సీనియర్ న్యాయవాదిగా పేరు పొందిన అయన తొర్రూర్ ఏజిపిగా నియమితుల కావడం పట్ల పలువురు న్యాయవాదులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ధరణి దరఖాస్తులు క్లీయరెన్స్ అయ్యేనా...?



రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధిత రైతులు

నూటికీ 80 శాతం రిజెక్ట్ అయిన టీఎం 33 దరఖాస్తులు

సమాధానం చెప్పని రెవెన్యూ అధికారులు..

నవతెలంగాణ-బచ్చన్నపేట

ధరణి దరఖాస్తులు క్లియరెన్స్ అయ్యేటట్టు కనబడుతలేదు. నెలల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా బాధిత రైతుల ఆవేదనలు -కనబడుతున్నాయి. శనివారం మండల కేంద్రంలో నూటికీ 80 శాతం రిజెక్ట్ అయిన టీ ఎమ్ 33 దరఖాస్తులు వెలుగు చూస్తున్న సంఘటనలతో ఆరా తీయగా సమాధానం చెప్పని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని బాధిత రైతులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్న సంఘటనలు వార్ణనాతీతం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి లో నెలకొన్న పెండింగ్ భూముల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన విషయం విధితమే.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి టీఎం 33 ఆప్షన్ ఆన్‌లైన్ పేరిట బచ్చన్నపేట మండలంలో 550 పైచిలుకు రికార్డుకు రాని భూములపై దరఖాస్తులు చేసుకున్నారు. ఇట్టి విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దరఖాస్తులను పరిశీలించి మోకాపై రైతు భూమి ఉందా లేదా సంబంధిత ఎమ్మార్వో , సర్వేయర్లతో మోకా ఇంక్వైయర్ చేయడం జరిగింది. మోకాపై రైతు ఉండే పంట సాగు చేసుకున్న వివరాలను తెలుసుకొని, పక్క రైతుల స్టేట్‌మెంట్ తీసుకొని, ఎంక్వయిరీ రిపోర్టు రాసి సంబంధిత అధికారులకు తహసీల్దార్ కార్యాలయం నుండి ఆన్‌లైన్ చేయడం జరిగిందని, తిరిగి సంబంధిత అధికారులు అదే ఆన్‌లైన్ లో వందకు 20 శాతం కూడా రైతులకు న్యాయం జరగడంలేదు. కారణం పెద్ద మొత్తంలో రిజెక్ట్ చేయడమే భూమిపై ఉన్నప్పటికీ సాగు చేస్తున్నప్పటికీ పక్క రైతుల స్టేట్‌మెంట్ ఇచ్చినప్పటికీ ఎందుకు రిజెక్ట్ అవుతున్నాయని రెవెన్యూ కార్యాలయంలో అధికారులను బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇట్టి విషయంపై రైతులు కార్యాలయం చుట్టూరా చెప్పులు అరిగేలా చెక్కర్లు కొడుతున్నారు. దరఖాస్తుల రిజెక్టుపై సంబంధిత తహసీల్దార్ ను వివరణ కోరగా (ఆర్ఎస్) రికార్డు ప్రకారం ఉన్న భూమి కన్నా ఎక్కువ పెంచలేమని, రికార్డు ప్రకారం అట్టి భూమిలో నమోదుకు ఖాళీ ఉన్నప్పుడే దరఖాస్తుదారుడి భూమి ఎంట్రీ చేయగలమని, రికార్డుకు ఎక్కువ పెంచి నమోదు చేసే ఆప్షన్ లేదని వెల్లడించారు.

ముత్తయ్య పార్థివ దేహానికి నివాళి



నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులిగిల్ల ముత్తయ్య ఆదివారం మరణించాడు .ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ముత్తయ్య పార్థివ దేహానికి పూల వేసి నివాళు లర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.ఈకార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంగి కుమార్, నాయకులు బోనగిరి యాకస్వామి, తోటకూరి పాండుకృష్ణ, తదితరులున్నారు.

దళారుల పాలవుతున్న నల్లరేగడి..

ప్రభుత్వ ఆదాయానికి గండి

చోద్యం చూస్తున్న అధికారులు



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

గ్రామాల్లోని ఊర చెరువుల్లో నల్లరేగడి మట్టి దళారుల పాలవుతోంది.. సారవంతమైన నల్లరేగడి మట్టిని రైతులు తమ పంట పొలాల్లో తోలుకోవాలన్న భవిష్యత్తులో దొరకకుండా పోతుంది. నల్లరేగడి మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టి యజమానులు మండలంలోని నాంచారి మడూరు వజ్జరికుంట నుండి జెసిబి ట్రాక్టర్లతో గ్రామంలో గుట్టలు గుట్టలుగా నల్లరేగడి మట్టిని ఇటుక బట్టీల కోసం తోలుకుంటున్నారు.రాగడిమట్టిని సారవంతమైన నేల కోసం వ్యవసాయ వ్యవసాయ దిగుబడి కోసం ఉపాధి హామీ పథకం క్రింద రైతులను వినియోగించుకోమంది కాని ఈ దళారుల ఇటుక బట్టీలకు సారవంతమైపోయింది. ఇల్లుకు పునాది అయిపోతుంది. చెరువు భూమి లోనుండి తీసుకపోతున్నటువంటి వైనం అయినా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.. అధికారులకు ఏమైనా ముడుపులు చెల్లాయా .? లేక అధికార పార్టీ అండదండలు ఉన్నాయా..? నిత్యం వ్యాపార దందా ఇటిక బట్టీలకు నడుస్తూనే ఉంది. దాంతోపాటు ఖమ్మం టూ వరంగల్ జాతీయ రహదారిపై ఈ ఇటుక బట్టీలు ఉండడంవల్ల వచ్చిపోయే వాహనదారులకు కళ్ళల్లో దుమ్ము దూళి పడడంతో యాక్సిడెంట్లు అవుతున్నాయి. వెలికట్ట నుంచి నాంచారి మడూరు వరకు ఇబ్బంది పడుతున్నారు. యాక్సిడెంట్లతో వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు .. చెరువులో కెళ్ళి ఎక్కడైతే మంచి మట్టి రాగడి ఉంటదో ఆ యజమాని దగ్గరుండి తీయించుకొని వెళుతున్న పరిస్థితి. తక్షణమే మైనింగ్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపైనే విద్యుత్ స్తంభాలు..



నేలకొరుగుతున్న మహావృక్షాలు

పట్టించుకోని అధికారులు..

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

రోడ్డుకు దూరంలో పాతవలసిన కరెంటు పోల్స్ రోడ్డుపైన పాతాడంవల్ల తీగలకు చెట్లు అడ్డొస్తున్నాయని ఏళ్లనాటి నీడనిచ్చే మహా వృక్షాలను నేలకూల్చుతున్న పరిస్థితి.రోడ్డుకు దూరంగా పాతినట్లయితే రైతుల పొలాల్లో నుండి లైన్ వేయుటకు ఒప్పుకోవడం లేదని కరంటూ లైన్ వేసే కాంట్రాక్టర్ అంటున్నారు. పాలకుర్తి నుండి జనగామకు గల ప్రధాన రహదారిలో గల తొర్రూరు గ్రామములో సబ్ స్టెయిన్ 33/11కిలో వాట్ల సబ్ స్టెయిన్ చేపడుతున్నారు. దాదాపు రూ.60 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టబోతున్న సబ్ స్టేషన్ 2023 అక్టోబర్ 8 న అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శంకుస్థాపన చేశారు. సబ్ స్టేషనకు కావలసిన కరంటూ లైను ఇరవేన్ను సబ్ స్టేషన్ జంక్షన్ నుండి మేయిన్‌లైన్ లాగుతున్నారు. తొర్రూరు గ్రామము నుండి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు ప్రధాన రహదారి పై నుండి కరంటుపోల్స్ పాతుతున్నారు. అట్టి కరెంటు లైన్‌కు చెట్లు అడ్డు వస్తున్నాయని రోడ్డుపై గల ఏళ్ళ నాటి మహావృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం హరితహారం పేరుతో రోడ్డు వెంట చెట్లు నాటి వృక్ష సంపద పెంచుటకు కృషి చేస్తున్నాయి. అటువంటి సందర్భంలో రోడ్డుపై గల మహావృక్షాలను కరెంటు లైన్ కు అడ్డు వస్తున్నాయనిని కొట్టివేయడం ఎంతవరకు సమంజసమని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు చెట్లు పెంచే స్థలం వదిలిపెట్టి కరెంటు పోల్స్ పాతినట్లయితే రహదారి వెంట వన సంపద పెంచుటకే కాక వాతావరణ సమతుల్యతకు, నీడ సౌకర్యం కల్పించే విధంగా అధికారులు శ్రద్ధ తీసుకోవాల్సినన అవసరం ఎంతైనా ఉందని వన ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.

డీఆర్డీవోకు లేఖ ఇచ్చాం

ఆర్‌బి.అండ్ డిఈవీ. జీవన్ కుమార్

రోడ్డుపై అతి సమీపంలో మొక్కలు నాటవద్దని గతంలో డీఆర్డీవోకు లేఖ ఇచ్చాం. అదేవిధంగా రోడ్డుపై కూడా కరెంటు పోల్స్ పాత వద్దని కూడా సామాచారం ఇచ్చాం.. వాటి గురించి స్పందన రాలేదు. రోడ్డుపై వివిధ రకాల ఇంటర్నెట్ ప్రొవైడర్ వాళ్లు, మెషిన్ మిషన్ భగీరథ వంటి పైపులైన్లు వంటి రకరకాల పనులకు రోడ్డునే త్రవ్వే వేస్తున్నారు.విద్యుత్‌శాఖ వారు కూడా రోడ్డు వెంటనే రోడ్డు ఎన్ని వంకలు తిరిగితే అన్ని వంకలుగా తిప్పుతూ లైన్లు వేస్తున్నారు. వీటి వల్ల ప్రజా రవాణాకు సౌకర్యవంతంగా ఉండవలసిన రోడ్లు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. సంబంధిత శాఖలు రోడ్డుపైనే కాకుండా రోడ్డుకు దూరంలో సంబంధిత ఆపరేషన్ పనులు చేసుకున్నట్లయితే బాగుంటుంది.

రోడ్డుపక్కనే పోల్స్ వేయడం వన సంపదకు నష్టం

కడుదూరి ప్రభాకర్, రైతు



రోడ్డు పక్కనే కరెంటు పోల్స్ వేయడం వల్ల వన సంపదకు నష్టమే కాకుండా, రోడ్డు విస్తరణ జరిగినప్పుడు అదనంగా ప్రజాధనం వృధా అయ్యే అవకాశం ఉంది. కరెంటు జంక్షన్ నుండి వచ్చే మేన్ లైను నేరుగా సబ్‌స్టేషన్ వరకు స్టేట్ గా తీసుక పోయి నట్లయితే ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది.

చెట్లను తొలగించడం మానవ మనుగడకే ప్రమాదం

సోమసత్యం, సీపీఎం. మండల నాయకులు



చెట్లు కొట్టడం వల్ల మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రకృతిలో వాతావరణ సమతుల్యతను కాపాడుకొనుటకు వన సంపద చాలా కీలకమైంది. గ్రామంలో చెట్లు కొట్టాలంటే ప్రభుత్వ పరిమిషన్ కావాలి. కాని ప్రధాన రహదారిపై కరెంటు పోల్స్ పాతి చెట్లు అడ్డొస్తున్నాయని ఏళ్ల నాటి వృక్షాలను కూల్చడం ఎంతవరకు సమంజసం. ప్రకృతి వన సంపదను హాని చేయటం సిగ్గు చేటు . తొర్రూరు గ్రామంలో ఏర్పాటు చేయుచున్న సబ్ స్టేషన్ మెయిన్ లైను రూటు మార్చి రోడ్డుకు దూరంలో లైన్ వేయాలి.

మాది ఆపరేషన్ డిపార్టమెంట్ సెక్షన్ .

ఆర్.బాలగంగాధర్ తిలక్ , పాలకుర్తి ఇన్‌ఛార్జ్ ఎడిఎ

క్రొత్తగా లైన్ వేయడం, సబ్ స్టేషన్ల నిర్మాణం వంటి కార్యక్రమాలకు కన్స్ట్రక్షన్ డిపార్ట్మెంట్ సెక్షన్ వేరే ఉంటుంది. ముఖ్యంగా రైతుల భూముల నుండి కరెంటు లైన్ వేయుటకు రైతులు అడ్డుపడుతున్నారు. సమాచారం కొరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అఖిలేష్ బాబురావును 'నవతెలంగాణ' విలేఖరి ఫోన్ ద్వారా సంప్రదించగా పూర్తి సమాచారం చెప్పకుండానే దాటవేసినారు. పూర్తి సమాచారం కావాలని మళ్ళీ ఫోన్ చేయగా ఫోన్ రిసీవ్ కాలేదు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్ నియామకాలు చేపట్టి ఉచిత విద్యుత్ అందజేయాలి



టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్

నవతెలంగాణ-జనగామ

రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, మోడల్ స్కూళ్లలో కేజీబీవీ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని,. స్కావెంజర్ల నియామకం చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పిచ్చెట్టి చంద్రశేఖర్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సజావుగా సాగడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషిని అభినందిస్తున్నామన్నారు.. అదేవిధంగా ఇప్పటికే బకాయి పడ్డ ఐదు విడతల కరువు భత్యాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని,. పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను తక్షణమే చెల్లించాలని, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణం చేసే కుట్ర చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థుల కనీస వయస్సును 6సంవత్సరాలు చేయడం ఆ వయసుకు ముందున్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరకుండా నిలువరించడమేనని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తాళ్లపల్లి హేమలత, కోశాధికారి తాడూరి సుధాకర్, జిల్లా కార్యదర్శులు చిక్కుడు శ్రీనివాస్, జ్యోతి శ్రీహరి,మహ్మద్ ముషీర్ ఖాన్, పత్తి వెంకటాద్రి,.కృష్ణ, తోట వేంకటేశ్వర్లు,.వివిధ మండలాల బాధ్యులు వీరమల్ల బాబయ్య, గుండె కనకయ్య, బేతి శ్రీధర్, ఆగయ్య, దోకురి రాములు, జంపయ్య, గెజిటెడ్ హెచ్ఎం పోతుగంటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఇనుగుర్తి



మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1989-1990బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన అనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూల వర్షం వెదజల్లుతూ చప్పట్లతో సాంప్రదాయ పద్ధతిలో సభ స్థలానికి ఆహ్వానించారు. ఉపాధ్యాయులకు పుష్పగుచ్చాలు అందజేస్తూ వేదిక పైకి సగౌరవంగా తీసుకెళ్లారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. సుమారు 72 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆప్యాయ పలకరింపులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులను ఒకరినొకరు పరిచయాలు చేసుకున్నారు. అనంతరం పాఠశాలలో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. అనంతరం చదువుకున్న పాఠశాలకు బహుమతిగా రూ.లక్ష వెచ్చించి నీటి శుద్ధీకరణ యంత్రం, రెండు గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ పొయ్యి, పది కుర్చీలు, టీపాయి బహుమతిగా అందించారు. ఈకార్యక్రమంలో వద్దిరాజు చిన్న వెంకన్న, ఆనందపు రవిబాబు, మధుబాబు, బేతమల్ల చంద్రయ్య, వైరు శ్రీనివాస్, గుర్రం శ్రీను, గుండ్ల యాకన్న, బైరు యాకన్న, ఆండాలు, నవనందుల శ్రీనివాస్, పరుపాటి రాజేందర్ రెడ్డి, కొట్ట మహేందర్ స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
సోమవారం జులై 08, 2024
www.navatelangana.com

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా మధు ఎన్నిక

నవతెలంగాణ-బయ్యారం:



పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బోనగిరి మధు ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు జులై 6, 7 తేదీలలో సంగారెడ్డిలో నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర నాయకుడిగా ఉన్న బోనగిరి మధు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించే దిశగా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల మహబూబాబాద్ జిల్లాలోని సీపీఐఎంఎల్ పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మధును ప్రత్యేకించి అభినందించారు.



ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలి

కేవీపీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య డిమాండ్

నవతెలంగాణ -మరిపెడ

అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కులవక్షత వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్న లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మరిపెడ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక పేట గ్రామానికి చెందిన దళిత యువ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది వేధింపులు అవమానాలకు తట్టుకోలేక ఎస్సై శ్రీనివాస్ గత నెల 30న మహబూబాబాద్ లో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకోగా, హైదరాబాదు యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మతి చెందడం దురదష్టకరమన్నారు.చివరి సమయంలో పోలీస్ శాఖలో జరుగుతున్న వివక్షతనుచ, తానుబడ్డ బాధలను వీడియో వైరల్ కావడం చర్చ జరిగిందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న నేటికి కులవివక్షత విశ్వరూపం దాల్చుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాదులో పీహెచ్డబు విద్యార్థి వేముల రోహిత్ కు కుల వివక్షతకు అవమానానికి గురై ఆత్మహత్య చేసుకోగా, నేడు అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ తాను విధులు నిర్వహిస్తున్న పోలీస్ శాఖలో జరిగిన అన్యాయాన్ని; అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, దళితులు; గిరిజనులు ఉన్నతమైన విద్యని చదువుకొని ఉద్యోగాలలో రాణిస్తుండగా నేటికి సమాజంలో కులవివక్షతతో అవమానాలు; ఆవేదనలు జరగడం సిగ్గుచేటన్నారు. ఇంత జరుగుతున్న పై స్థాయి అధికారులకు తెలిపిన దళితుడనస్త్ర భావంతో ఎవరు కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం; వివక్షత రూపాన్ని చూసి ఎస్సైభరించలేక పోయారని పేర్కొన్నారు. పేద కుటుంబంలో పుట్టి పోలీస్ శాఖలో ఎస్ఐగా పనిచేస్తూన్నా శ్రీరాముల శ్రీనివాసును అనేక అవమానాలకు గురి చేసిన వైనం తాను వెల్లడించిన వీడియోలో వైరల్ కావడం అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసు ఆత్మహత్య గల కారణాలను వాస్తవాలను వెలుగులోకి రానీయకుండా అధికారులుతొక్కిపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయని. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్రీనివాస ఆత్మహత్యకి కారుకులవైన వారిపై చట్టపరమైనచర్యలు తీసుకొని కిందిస్థాయి ఉద్యోగులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పట్టణ నాయకులు పత్తిపాటి వినయ్, జే పరశురాములు, డి ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సామాజిక తరగతులను విజయవంతం చేయాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దు డ్డెల రామ్మూర్తి



నవతెలంగాణ-కేసముద్రంరూరల్

ఈనెల 15 16 17 తేదీలలో హనుమకొండ లో జరిగే కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సామాజిక చైతన్య శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కులవక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి తెలిపారు. ఆదివారం కేసముద్రం పట్టణ కేంద్రంలో జరిగిన కేవీపీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత నియంత ప్రభుత్వం పోయి ప్రజా పాలన చెప్పుకుంటున్న ప్రభుత్వం వచ్చినా నేటికీ దళితులపై దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నాయని దుడ్డేల రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య, జిల్లా నాయకులు చింత ఎల్లయ్య, చీపిరి యాకయ్య, మచ్చ వెంకన్న, పేటిక వెంకట రాములు, సోమారపు ఎల్లయ్య, నీలగిరి సురేష్, నరసింహారావు, తదితరులు ఉన్నారు.

భీముని పాదం జలపాతంలో.. సందర్శకుల సందడి..



నవతెలంగాణ-గూడూరు

మండలంలోని సీతా నాగారం గ్రామపంచాయతీ కోమలవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం వద్దకు సందర్శకులు సందడి ఆదివారం పెరిగింది వర్షాలతో జలపాతం జాలు వారతుండడంతో వివిధ ప్రాంతాలు వరంగల్ హనుమకొండ మహబూబాబాద్ సుదీర్ఘ ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చి సందడి చేశారు సందర్శకుల సందడి పెరగడంతో అటవీశాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు ఇక్కడ ఎలాంటి ఆలోచనలు ఏ సంఘటనలు జరగకుండా అటవీశాఖ ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టింది.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

నవతెలంగాణ-మరిపెడ



మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఎదురుగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జినక స్వామి మాదిగ జెండాను ఆవి ష్కరించారు. ఈకా ర్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవీందర్, జిల్లా కమిటీ మెంబర్ వంగూరు వెంకటేశ్వర్లు, ఎమ్మా ర్పీఎస్ నాయకులు హనుమకొండ రంగన్న, జినక రమేష్, అశోక్, భుజంగం జనక చంద్రయ్య భాష్పాంగు రాములు, తదితరులు పాల్గొన్నారు

'పత్తి' విత్తన.. భారం..!



ఏటా పెరుగుతున్న పత్తి విత్తనాల ధరలు

ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు

నవతెలంగాణ-తొర్రూరు

అసలే పెట్టుబడులు పెరిగి రైతాంగం ఆందోళన చెందుతుంటే పెరిగిన పత్తి విత్తన ధరలు రైతులపై మరింత భారం మోపుతున్నాయి. ఈ ఏడాది పత్తి విత్తన బ్యాగుపై 11 రూపాయలు పెంచినట్లు తెలుస్తుంది. గత సంవత్సరం ఒక ప్యాకెట్ ధర 853 రూపాయలు ఉండగా 2024- 25 లో వ్యవసాయ సీజన్‌కు సంబంధించి పెరిగిన ధర తో కలుపుకొని 864 రూపాయలకు పెరిగింది. మండలంలో 9500 ఎకరాల్లో పత్తి సాగు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం 2500 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు..

ప్రతి ఏడాది పత్తి విత్తన పాకెట్ ధరలు పెరుగుతుండడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతుంది. కార్పొరేట్ సీడ్ కంపెనీలు రైతుల నుంచి విత్తనాలు సేకరించి, వాటిని గ్రేడింగ్ చేసి జర్మినేషన్ చెక్ చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. రైతుల నుండి సీడ్ కంపెనీలు కొన్న పత్తి విత్తనాలు.. సీడ్ ప్యాకెట్ల రూపంలో తిరిగి రైతులకు చేరే సరికి ధర భారీగా పెరిగిపోతుంది. ఎకరాకు ఒకటిన్నర లేదా రెండు ప్యాకెట్లు అవసరం కాగా, రైతుల పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగిపోతున్నాయి. పత్తి అధికంగా సాగు చేసే ఈ మండలంలో రైతాంగాన్ని విత్తన ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తుంది.

గత నాలుగేళ్ల లెక్కలు పరిశీలిస్తే..

2021- 22 ఆర్థిక సంవత్సరంలో సగటున ఒక ప్యాకెట్ ధర 730 రూపాయలుగా ఉన్న పత్తి సీడ్ ప్యాకెట్ ధర ఇప్పుడు 864 చేరింది. అంటే నాలుగు ఏళ్ల వ్యవధిలో 134 మేర ఒక ప్యాకెట్ పై ధర పెరిగింది. ప్రతి సంవత్సరం సగటున 30 రూపాయల చొప్పున విత్తన ప్యాకెట్ల ధరలు పెరిగిపోతున్నాయి. ఏటా విత్తన ధరలు, క్రిమిసంహారక మందులు, యంత్రాల వినియోగ చార్జీలు, కూలీల ధరలు కూడా పెరుగుతుండడంతో రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ఎకరాకు రెండు పాకెట్లు చొప్పున రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తారు. వర్షాలు సకాలంలో కురవక పోతే విత్తనాలు మళ్ళీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో రైతులపై భారం అధికంగా పడుతుంది. విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని, ధరలను నియంత్రించాలని రైతుల కోరుతున్నారు.

విత్తన ధరలు పెరిగాయి ఇలా..

2020-21 సంవత్సరంలో రూ.730
2021-22 సంవత్సరంలో రూ.767
2022-23 సంవత్సరంలో రూ.810
2023-24 సంవత్సరంలో రూ.853 రూపాయలు,
2024-25 సంవత్సరంలో 864 రూపాయలు పెరుగుతూ వచ్చింది.

విత్తన ధరలు తగ్గించాలి..

పాడియా బీకూ, రైతు.



పత్తి విత్తన ధరలు తగ్గిస్తారనుకుంటే పెరిగాయి. ఇది రైతులకు ఇబ్బందిగా, భారంగా మారింది. ఇప్పటికే పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు ప్రభుత్వం విత్తన ధరలు పెంచడంతో పెట్టుబడి ఇంకా పెరుగుతుంది. అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తన ధరలు వెంటనే తగ్గించాలి.

కంపెనీలకు లాభం చేకూర్చేందుకే..

పాద్యా భిక్ష , రైతు.



కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ధరలు పెంచుతున్నారు. దీంతో రైతులపై భారం పడుతుంది. ప్రభుత్వం పెంచిన ధరలతో పాటు సబ్సిడీని పెంచితేనే రైతులు నష్టపోరు. ఇది ముమ్మాటికి రైతులను మోసం చేయడమే.

జులై 10న కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని జులై 10న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం కేసముద్రం మండలంలోని హరిహర గార్డెన్ లో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని గత పది సంవత్సరాలుగా సాగించిన ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేయడానికి ఉవ్విళ్లూరుతోందని ఆయన తెలిపారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మేయడం వంటి చర్యలను వేగవంతం చేయడంలో భాగంగానే శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ని వేలం వేస్తున్నదని విమర్శించారు. దుర్మార్గంగా కార్మికులను బలి కోరే లేబర్ కోడ్ ల అమలుకు పూనుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంభిస్తుందని వివరించారు. ఆశాలకు పరీక్షలు నిర్వహించటం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో మాట తప్పి అంగన్‌వాడీలను ఏకపక్షంగా ఉద్యోగంలో నుండి తీసేయడం వంట చర్యలు చేపట్టిందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలకు అందక అవస్థలు పడుతున్న చోద్యం చూస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 10న జరిగే కార్మికుల డిమాండ్స్ డేలో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు మండల కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, దుండి వీరన్న, చింతా మౌనిక, జల్లే జయరాజు, దాసరి మల్లేశం, వల్లాల వెంకన్న, ఈసంపల్లి సైదులు, జమ్ముల శ్రీను, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తున్న డీఈవోనును సస్పెండ్ చేయాలి



టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్న మహబూబాబాద్ డీఈఓ ను సస్పెండ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మానుకోటలోని గర్ల్స్ హైస్కూల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ.మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ వ్యవహరిస్తున్నారని, ఇటీవల నిర్వహించబడిన ప్రమోషన్స్, ట్రాన్స్‌ఫర్లలో ఎస్సీ మహిళలకు రావాల్సిన ప్రమోషన్లు 'రోస్టర్' పాటించనందున ఎస్సీ పురుషులకి కేటాయించారని టిఎస్ యూటీఎఫ్ జిల్లా బాధ్యుల చొరవతో రాష్ట్ర కమిటి సహకారం కారణంగా తిరిగి మహిళలకు ప్రమోషన్స్ ఇవ్వనైనదన్నారు. వారి స్థానంలో ప్రమోషన్ పొందిన పురుషులకు రివర్షన్ ఇవ్వటంతో వారు మానసికంగా క్రుంగిపోయారన్నారు. అనేక పొరపాట్లు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తున్న జిల్లా విద్యాశాఖధికారి ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా కార్యదర్శులు నామ వెంకటేశ్వర్లు, కె భిక్షపతి, పి మంజుల, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి వివేక్, సభ్యులు హరినాయక్, వివిధ మండలాల బాధ్యులు జి.సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్, సుందర్ కుమార్,గోవర్ధన్, వెంకన్న, వంశీకష్ణ, తిరుపతి, భద్రునాయక్, జంపయ్య, రహమాన్, యాకుబ్, ప్రభాకర్, పార్వతి, కుమార్, ప్రసాద్, మైసయ్య పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

ఈనెల 10న ధర్నాను జయప్రదం చేయాలి

సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు

నవతెలంగాణ-నెల్లికుదురు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26000 అమలు చేయాన్నారు. ఈనెల 10 న మండల జిల్లా కేంద్రాలలో జరిగే స్కీమ్ వర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు జూలై 10 న కార్మిక వర్గం పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు. ఈ నెల 10 న జరిగే ధర్నాలో అంగన్‌వాడీలు, ఆశాలు హమాలీ భవననిర్మాణ కార్మికులు, ఐకెపి వివోఏలు గ్రామపంచాయతీ కార్మికులు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పెరుమాండ్ల పుల్లయ్య వెంకన్న నర్సయ్య, ఐలయ్య, శ్రీనివాస్, మురళి, యాకన్న, గ్రామ పంచాయతీ హమాలి భవన నిర్మాణం రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





పదవులు శాశ్వతం కాదు, ప్రజా సేవే ముఖ్యం..

ఎంపీపీ, జడ్పీటీసీలకు సన్మానం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

నవతెలంగాణ-పెద్దవంగర:

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, ప్రజా సేవే ముఖ్యమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్ రావు అన్నారు. ఆదివారం పర్వతగిరిలోని వారి నివాసంలో ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవంగర తొలి ఎంపీపీ ఈదురు రాజేశ్వరి ఐలయ్య, జెడ్పీటీసీ శ్రీరామ్ సుధీర్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దయాకర్ రావు మాట్లాడుతూ ప్రజలకు గత ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులుగా అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. గ్రామ ప్రజలకు అండగా ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చినా, ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విరమణ పదవికే కాని, సేవకు కాదని భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలన తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించామని, వారి సహకారం మర్చిపోలేనిదన్నారు.

వాహనాల బహిరంగ వేలం

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 8న సోమవారం(నేడు) ఉదయం 11 గంటలకు వాహనాల బహిరంగ వేలం పాట నిర్వహించబడుతుందని తొర్రూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. ప్రవీణ్ ఆదివారం తెలిపారు. అక్రమంగా నాటుసారా, బెల్లం సరఫరా లు చేస్తూ గత కొంతకాలంగా పట్టుబడిన సుమారు 46 వాహనాలను వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి అంజన్ రావు, మహబూబాబాద్ డిపి ఈవో కిరణ్ ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బహిరంగ వేలం పాట నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు.

రైతుల మోటార్లు చోరీ.. కేసు నమోదు



నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రంలోని ఆకేరు వాగులో మోటర్లు ఏర్పాటు చేసుకొని సాగు చేసుకుంటున్న చిన్నగూడూరుకు చెందిన పసునాది రజిత, కోల సతీష్, ఉగ్గంపెల్లి గ్రామానికి చెందిన భర్తపురపు వెంకటేశ్వర్లు ముగ్గురు రైతుల సుమారు రూ.90 వేల విలువగల వ్యవసాయ మోటార్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ చోరీ తో ఆకేరు వాగులో మోటర్లు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకునే రైతులకు చీడ పీడల నుండి పంటను కాపాడుకోవడంతో పాటు మరో చిక్కు వచ్చి పడింది వ్యవసాయ మోటార్లు ఎత్తుకెళ్తుండడంతో తమ మోటార్లను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు చోరీకి గురైన మోటార్ల రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లోఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదు మేకపిల్లలు మృతి



నవతెలంగాణ-ఇనుగుర్తి

ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆదివారం కుక్కలు దాడి చేసి ఐదు మేక పిల్లలను చంపేశాయి. ఇంటి వద్ద దొడ్డిలో దాచి ఉంచిన మేక పిల్లలపై కుక్కలు దాడి చేయగా అవి అక్కడికక్కడే మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన చిన్నాల ఐలయ్య రోజు వారి వృత్తిలో భాగంగా మేకలను మేపడానికి వెళుతూ చిన్న మేక పిల్లలను ఇంటి వద్ద దొడ్డిలో దాచి వెళ్లాడు. కుక్కలు వాటిపై దాడి చేయడంతో ఐదు మేక పిల్లలు మత్యువాత పడ్డాయి. సమాచారం తెలిసిన ఐలయ్య మేక పిల్లల వద్దకు వచ్చి బోరున విలపించాడు. తమ రోజువారి బతుకుదెరువు అయినా గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి తినడంతో బోరున విలపిస్తూ మృతి చెందిన మేక పిల్లల విలువ రూ.25 వేలు ఉంటుందని బాధితుడు ఐలయ్య తెలిపారు. తమకు ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని కోరాడు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గార్ల:

గత కొన్ని దశబ్దాలుగా మాదిగల హక్కుల కొరకు ఎమ్మార్పీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని అ సంఘం సీనియర్ నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక అమరవీరుల చౌరస్తా లో ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా సీనియర్ నాయకులు తారకరామారావు ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల హక్కుల పరిరక్షణకు ఎమ్మార్పీఎస్ చేపట్టే పోరాటాలలో మాదిగలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, మండల నాయకులు సిరిపంగి నారాయణ, రాములు, సత్తి తదితరులు పాల్గొన్నారు.

